సాక్షి అనకాపల్లి

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



వైభవుడికి సుప్రభాత సేవ

విశాఖ నగరంలోని కప్పరాడ వైభవ వేంకటేశ్వర స్వామి వారికి సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు.



నేడు వ్యాకులమాత మహోత్సవం

విశాఖ: కొత్తవలస కొండ డాబాలలోని వ్యాకుల మాత పుణ్యక్షేత్రంలో ఆదివారం పాప పశ్చాత్తాప ఉత్సవం జరగనుంది.



ముగిసిన ఆరాధనోత్సవాలు

విశాఖ: కళాభారతిలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధన మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి.

న్యూస్‌రీల్

గ్రామీణ ప్రాంతాల్లో సేవలు ప్రశంసనీయం

- లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మోర్



విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మోర్

నర్సీపట్నం: అంతర్జాతీయంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న లయన్స్ క్లబ్ గ్రామీణ ప్రాంతాల్లో కూడా తన కార్యకలాపాలను విస్తరిస్తోందని లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ మోర్ పేర్కొన్నారు. నర్సీపట్నంలో లయన్స్ క్లబ్ ఏర్పాటు చేసిన సేవా మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్లబ్ ఏర్పడిన తరువాత మొదటి సారిగా అంతర్జాతీయ పాస్ట్ ప్రెసిడెంట్ రావడంతో వేద పండితులు, క్లబ్ ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎ.గోపాలరావు, పాస్ట్ గవర్నర్ డి.రాఘవేంద్రరావు, క్లబ్ ప్రతినిధి చింతకాయల సన్యాసిపాత్రుడు ఫ్రాంక్ మోర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన లయన్స్ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. రూ.30 లక్షలు విలువ గల కుట్టుమిషన్లు, గ్రైండర్స్, వినికిడి యంత్రాలు, విద్యార్థులకు సైకిళ్లు, స్కూల్ బ్యాగులు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు.

నిర్మాణంలో ఉన్న పరిశ్రమలో ప్రమాదం

- ముగ్గురికి గాయాలు

యలమంచిలి రూరల్: బయ్యవరం పంచాయతీ పరిధిలో నిర్మాణ పనులు జరుగుతున్న వైశాఖీ బయోమెరైన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు. 20 అడుగులకు పైగా ఎత్తులో ఉన్న భారీ షెడ్డుకు అమర్చుతున్న ఇనుప రాడ్లు ఊడిపోవడంతో అక్కడ పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు కింద పడిపోయారు.

సేఫ్టీ బెల్టులుండటంతో వారికి ప్రాణాపాయం తప్పిందని యలమంచిలి సీఐ షేక్ గఫూర్ శనివారం రాత్రి చెప్పారు. గాయపడిన ముగ్గురికీ అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. వీరిలో ఒక కార్మికుడికి ఇంకా చికిత్స కొనసాగుతోందని సీఐ తెలిపారు. గురువారం జరిగిన ఈ ప్రమాదం విషయాన్ని పరిశ్రమ యాజమాన్యం గోప్యంగా ఉంచింది. గాయపడిన కార్మికులు రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారని తెలిసింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటును తమ గ్రామ ప్రజలు వ్యతిరేకిస్తున్నా సాగునీటి కాలువలు కప్పి పరిశ్రమ నిర్మాణ పనులు చేపడుతున్నారని వైస్ ఎంపీపీ రాజాన శేషగిరిరావు(శేషు) శనివారం రాత్రి ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ యాజమాన్యంపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయనున్నట్టు ఆయన చెప్పారు.

అంతర్ జిల్లా పోటీలకు హాకీ జట్ల ఎంపిక



రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక చేసిన జట్టుతో హాకీ అసోసియేషన్ సభ్యులు

యలమంచిలి: అంతర్ జిల్లాల రాష్ట్ర స్థాయి బాల, బాలికల హాకీ పోటీలకు జిల్లా జట్లను శనివారం యలమంచిలిలో ఎంపిక చేశారు. డిగ్రీ కళాశాల హాకీ గ్రౌండ్‌లో జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాలికల విభాగం, సబ్ జూనియర్ బాలుర విభాగంలో 50 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు జిల్లా హాకీ అసోసియేషన్ చైర్మన్ ఆడారి వీరునాయుడు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను రేపటి నుంచి రెండు జట్లుగా విభజించి, యలమంచిలి హాకీ క్రీడా మైదానంలో శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు వేళాయె..

- రేపటి నుంచి ఒకేషనల్, 11 నుంచి జనరల్ ప్రయోగ పరీక్షలు
- నాన్ జంబ్లింగ్ విధానంలో మూడు విడతల్లో నిర్వహణ
- తొలిసారిగా ప్రాక్టికల్ మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు



యలమంచిలిలో ఓ ప్రైవేటు కళాశాలలో ప్రయోగశాలలో రసాయనాలు



యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు రంగం సిద్ధమైంది. జిల్లా ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా జిల్లా యూనిట్‌గా పరీక్షలు జరగనుండడంతో పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 2న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నైతికత, మానవీయ విలువలు అనే సబ్జెక్టుపై పరీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి 23న పర్యావరణ విద్య సబ్జెక్టుపై పరీక్ష నిర్వహించనున్నారు. ప్రయోగ పరీక్షలను ముందుగా ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించనున్నారు. ఈనెల 5 నుంచి 20 వరకు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. 45 పరీక్ష కేంద్రాల్లో జరిగే వొకేషనల్ ప్రాక్టికల్స్‌కు 4849 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జనరల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ఈనెల 11న ప్రారంభమై 20వ తేదీతో ముగుస్తాయి. 60 కేంద్రాల్లో 8100 మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు కళాశాల ప్రిన్సిపాల్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఎగ్జామినర్ల సమక్షంలో ఇంటర్మీడియట్ వెబ్‌సైట్ నుంచి ప్రశ్నాపత్రం డౌన్‌లోడ్ చేస్తారు.

ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు

ఈసారి మొదటిసారిగా ప్రయోగం పూర్తవగానే ఎగ్జామినర్లు జవాబు పత్రాలను వాల్యుయేషన్ చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా కొత్త విధానం రూపొందించారు.. గతంలో ఓఎంఆర్, బార్ కోడింగ్ అవార్డు షీట్లపై మాన్యువల్‌గా మార్కులు వేసేవారు. ఈ విధానంలో బోర్డు మార్పులు చేసింది. ఆన్‌లైన్‌లో ప్రయోగ మార్కుల నమోదు ఎలా చేయాలో ఎగ్జామినర్లు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లకు విధివిధానాలను ఇప్పటికే పంపించారు. ప్రయోగ పరీక్షలకు ఒకసారి నియమితులైన ఎగ్జామినర్ గరిష్ఠంగా మూడు రోజులు పని చేస్తారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను సెలవులు లేకుండా నిర్వహించనున్నారు. శని, ఆది వారాల్లోనూ ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగుతాయి. ప్రైవేటు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలకు డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించి ఎలాంటి అక్రమాలు జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక జిల్లా స్థాయిలో జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ), ప్రత్యేక బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ చేస్తాయి. పరీక్షలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే సీసీ కెమెరాలన్నింటినీ ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

సజావుగా పరీక్షల నిర్వహణ



మౌలిక వసతులున్న కళాశాలలనే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశాం. సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే ఎగ్జామినర్లు, ప్రిన్సిపాళ్లకు పరీక్షల నిర్వహణకు సంబంధించి శిక్షణ ఇచ్చాం. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పరీక్షల నిర్వహణ ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షలు సజావుగా జరిగేలా జిల్లా పరీక్షల కమిటీ పర్యవేక్షిస్తుంది.

–బి సుజాత, డీఐఈవో

భారత్ జోరు.. విశాఖ హుషారు







పాఠశాల విద్యార్థుల కేరింతలు



యశస్వి డబుల్ సెంచరీతో అభిమానుల ఆనందం

విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో రెండో రోజూ భారత్ జోరును కొనసాగించింది. దీంతో క్రికెట్ అభిమానుల్లో హుషారు రెట్టింపైంది. రెండో టెస్ట్ మ్యాచ్ లో భాగంగా తొలి రోజు ఆట యశస్వి వర్సెస్ ఇంగ్లండ్ కాగా, రెండో రోజు బుమ్రా వర్సెస్ ఇంగ్లండ్‌గా సాగడంతో అభిమానులు ఆటను పూర్తిగా ఆస్వాదించారు. యశస్వి డబుల్ సెంచరీని ప్రత్యక్షంగా తిలకించేందుకు శనివారం ఉదయాన్నే స్టేడియం వద్దకు చేరుకుని సందడి చేశారు. సౌత్, నార్త్ లోయర్ టైర్స్‌లో అభిమానుల హర్షాతిరేకాలతో స్టేడియం హోరెత్తింది. యశస్వి 191 పరుగుల వద్ద ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా వరుస బంతుల్లో ఫోర్, సిక్సర్‌తో డబుల్ సెంచరీ చేసినప్పుడు ఒకటే కోలాహలం నెలకొంది. మ్యాచ్‌ను చూసేందుకు మూడు వేల మందికి పైగా విద్యార్థులు తరలిరాగా.. వారందరినీ రెండు గేట్ల ద్వారా లోపలకు అనుమతించారు. ఆదివారం ఆట ప్రారంభానికి ముందు వచ్చిన విద్యార్థులనే అనుమతిస్తామని నిర్వాహకులు స్పష్టం చేశారు.

ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న శుభ్‌మన్ గిల్ రెండో రోజు ఆట ముగిసిన తర్వాత ఒక్కడే ఔత్సాహిక క్రికెటర్లతో కలిసి స్టేడియంలో ప్రాక్టీస్ చేశాడు. మూడో రోజు ఆటలో కీలకంగా మారి విశాఖ వేదికగానే ఫామ్‌లోకి రావడానికి సమాయత్తమయ్యాడు.

శాంతి పార్కు పనులు పూర్తి చేయండి

- మిగిలిన పట్టణాభివృద్ధి పనులపై జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయి కాంత్ వర్మ, అదనపు కమిషనర్ విశ్వనాథన్

తుమ్మపాల: పట్టణంలో శాంతి పార్కులో అభివృద్ధి పనులను ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని, దీని నిర్వహణ కోసం టెండర్ పిలవాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో చేపట్టిన పనులను అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం అనకాపల్లి జోనల్ కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సుంకరమెట్ట 'వై' జంక్షన్ వద్ద తారు రోడ్డు, నెహ్రూ చౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకు తారు రోడ్డు పనులను, ఎన్టీఆర్ స్టేడియంలో పనులను, రింగ్ రోడ్డు వద్ద పనులను, గుండాల జంక్షన్ వద్ద మీటింగ్ హాల్, గెస్ట్ హౌస్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ రామ్మోహన్ రావును ఆదేశించారు. సుంకరమెట్ట నుంచి శారదా బ్రిడ్జి, నెహ్రూ చౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకు సెంటర్ మీడియన్లలో అందమైన మొక్కలను ఏర్పాటు చేయాలని హార్టికల్చర్ విభాగాధిపతులకు సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్లు కృష్ణారావు, గణపతిరావు, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు చిరంజీవి, రాయల్ బాబు, ఏసీపీ ఝాన్సీరాణి, టీపీవో జనార్దన్, హార్టికల్చర్ అధికారులు సురేష్, పల్లవి పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు వరం.. విశ్వకర్మ పథకం



విశ్వకర్మ పథకం గురించి అవగాహన కల్పిస్తున్న పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్

- జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్

తుమ్మపాల: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం చేతివృత్తిదారులకు, కళాకారులకు వరం అని జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్ అన్నారు. పట్టణంలో వి.వి.రమణ రైతు భారతిలో ఎంఎస్ఎంఈ సంస్థ ఆధ్వర్యంలో విశ్వకర్మ పథకంపై సెమినార్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి వస్తున్న కళా నైపుణ్యాలకు మరింత మెరుగులు దిద్ది వారి కుటుంబాలకు, తద్వారా భారతీయ సంస్కృతికి ప్రపంచ ప్రఖ్యాతి కల్పించేందుకు విశ్వకర్మ పథకం రూపొందించారన్నారు. అంతే కాకుండా సంప్రదాయ కళాకారులకు ఆర్థిక చేయూత అందించనున్నట్లు తెలిపారు. కళా, వృత్తిదారులకు ఐదు నుంచి ఏడు రోజుల పాటు రూ. 500 స్టయిఫండ్‌తో కూడిన శిక్షణ ఉంటుందన్నారు. డిజిటల్ సేవ కార్డుతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, దానికి జిల్లా అమలు కమిటీ ఆమోద ముద్ర వేస్తుందన్నారు. ఎంఎస్ఎండీఈ, డీఎఫ్ఎస్, ఎంవోఎంఎస్ఎంఈ అధికారులతో కూడిన కమిటీ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. 18 సంప్రదాయ వ్యాపారాల్లో కళాకారులు, అర్హులందరూ వినియోగించుకోవాలన్నారు. డీఎల్‌డీవో మంజులవాణి మాట్లాడుతూ కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, టైలరింగ్, సంప్రదాయక ఆట బొమ్మల రూపకర్తలు, తాపీ పనివారు, గంపలు తయారు చేసేవారు, చర్మకారులు, క్షురకులు, మత్స్యకారులు, రజకుల వంటి వృత్తుల వారు వలంటీర్లు, మహిళా సంఘాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంఎస్ఎంఈ కోఆర్డినేటర్ ఏడీ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందన్నారు. రిజిస్ట్రేషన్ సమయానికి సంప్రదాయక చేతివృత్తిలో ఉండాలని సూచించారు. డీఆర్డీఏ పీడీ శచీదేవి, డీపీవో శిరీషారాణి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, ఏటీడబ్ల్యూవో నాగ శిరీష, డొమైన్ నిపుణులు నాగేశ్వరరావు, పరమేశ్వరరావు, విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గంగారాం పాల్గొన్నారు.

• ప్రగతి పరవళ్లు

మాడుగుల నియోజకవర్గంలో ప్రారంభోత్సవాల జోరు కొనసాగుతోంది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాడుగుల మండలంలోని 9 గ్రామాల్లో రూ.4.8 కోట్లతో నిర్మించిన 15 అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. రూ.63 లక్షలతో నిర్మించనున్న చినగొలిగెడ్డ కాజ్‌వేకు శంకుస్థాపన చేశారు. చీడికాడ మండలంలో రూ.12.32 కోట్లతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు.

8లో



మాడుగుల మండలం సత్యవరంలో వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ప్రియురాలిపై విష ప్రయోగం

- బాధితురాలి తల్లి ఫిర్యాదు

నర్సీపట్నం: తమ కుమార్తెపై ప్రియుడు విష ప్రయోగం చేశాడని బాధితురాలి తల్లి శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. టౌన్ ఎస్సై సుధాకరరావు వివరాల ప్రకారం.. నర్సీపట్నానికి చెందిన యువతి(26), నాతవరం మండలం వెన్నలపాలేనికి చెందిన వాసిరెడ్డి చంద్రశేఖర్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేరు ఉద్యోగులుగా పని చేసేవారు. ఈ క్రమంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. ఆరేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత నెల 27న వీరిద్దరు విశాఖపట్నం వెళ్లారు. అదే రోజు రాత్రి శేఖర్ తన ప్రియురాలిని ఇంటి వద్ద వదిలిపెట్టాడు. ఆ తర్వాత ఆమె వాంతులు చేసుకుని స్పృహ కోల్పోవడంతో తల్లిదండ్రులు విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తన కుమార్తె పెళ్లి చేసుకోవాలని కోరడంతో వదిలించుకునేందుకు అతడు విష ప్రయోగం చేశాడని, ప్రస్తుతం చావుబతుకుల మధ్య ఉందని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రేపు జిల్లాకు చంద్రబాబు రాక

సాక్షి, అనకాపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ నెల 5వ తేదీన కె.కోటపాడు మండలంలోని గొండుపాలెంలో జరిగే 'రా కదలిరా' బహిరంగ సభలో పాల్గొంటారు. గుంటూరు జిల్లా ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో వచ్చి ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్న బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు.

కరెంటు సమస్యల పరిష్కారానికి.. కదిలిన యంత్రాంగం

- వైవీ సుబ్బారెడ్డి ఆదేశాలతో ట్రాన్స్‌కో ఎస్ఈ, డీఈల రాక
- అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్తలైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- వేంపాడు, గొడిచర్ల సబ్ స్టేషన్ల పరిధిలో తీరనున్న విద్యుత్ కష్టాలు



గొడిచర్ల రైల్వేగేటు వద్ద లైన్ల ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ మహేంద్రనాథ్, ఇతర అధికారులు

నక్కపల్లి: మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో ఎస్ఈ నేతృత్వంలో ఉన్నతాధికారులు శనివారం నక్కపల్లి మండలంలో పర్యటించారు. వేంపాడు, గొడిచర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఈ అధికారుల బృందం పర్యటించి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. వివరాలు.. వేంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో ఓవర్ లోడ్ వల్ల వ్యవసాయానికి ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే ఏడు గంటల విద్యుత్ సరఫరాను రాత్రి సమయాల్లో ఇస్తున్నారని, రైల్వేట్రాక్‌కు అవతల ఉన్న సుమారు 10 మెరక గ్రామాలకు తరచూ అంతరాయం ఏర్పడుతోందని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీల ఆధ్వర్యంలో రైతుల బృందం శుక్రవారం విశాఖలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డిని కలిసి ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన సుబ్బారెడ్డి ట్రాన్స్‌కో సీఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. ఫలితంగా శనివారం ఉదయం ట్రాన్స్‌కో ఎస్ఈ మహేంద్రనాథ్, డీఈ రాజశేఖర్, ఏడీఈ లక్ష్మణరావులు వేంపాడు, నెల్లిపూడి, గొడిచర్ల, డొంకాడ గ్రామాల్లో పర్యటించారు. ఓవర్ లోడ్ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు వేంపాడు సబ్‌స్టేషన్‌లో అధిక లోడు భరించే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

డొంకాడ, జగన్నాథపురం, రమణయ్యపేట, జి.కొత్తూరు, డి.కొత్తూరు, సీతానగరం, ముకుందరాజుపేట, రేబాక తదితర గ్రామాలకు సమీపంలో ఉన్న గొడిచర్ల సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయడమే పరిష్కారమని పేర్కొన్నారు. ఇందు కోసం విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడానికి రైల్వే శాఖ అనుమతి కావాల్సి ఉందని, రైల్వేశాఖకు వెంటనే లేఖ రాయాలని, పర్మిషన్ వచ్చిన వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఏఈ రామకృష్ణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు అయినంపూడి మణిరాజు, పొడగట్ల పాపారావు, సర్పంచ్ చందిన కొండలరావు, ఎంపీటీసీ నిట్ల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల పండగ

- చీడికాడ మండలంలో రూ.12.32 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- తారురోడ్లు, సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు, సీసీ రోడ్లకు డిప్యూటీ సీఎం బూడి శ్రీకారం



చీడిపల్లి-అర్జునగిరి రోడ్డు శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి



డిప్యూటీ సీఎంను గజమాలతో సత్కరిస్తున్న వరహాపురం మహిళలు

చీడికాడ : అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా నిర్వహించిన ప్రారంభోత్సవాలతో పల్లెలు మురిసాయి. బూడికి పూర్ణకుంభం, కోలాటాలు, తీన్ మార్ వాయిద్యాలతో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. రూ.12.32 కోట్లతో వివిధ గ్రామాల్లో తారురోడ్లు, సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ భవనాలు, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, చీడికాడ, దిబ్బపాలెం పీఏసీఎస్ అధ్యక్షులు సన్నిబాబు, నందారపు రమణబాబు, వైస్ ఎంపీపీలు ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, చిన్నమ్మలు పాల్గొన్నారు.

మట్టిరోడ్లు తారు రోడ్లుగా...

పల్లెల అభివృద్ధికి రహదారులే ప్రధానం అని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మట్టిరోడ్లను తారురోడ్లుగా చేసే యజ్ఞం సఫలమైంది. మొత్తం రూ.7.80 కోట్లతో నిర్మించిన ఈ తారురోడ్లు అందుకు నిదర్శనంగా నిలిచాయి.

- రూ 2.20 కోట్లతో చీడిపల్లి నుంచి అర్జునగిరి వరకు 3.50 కిలోమీటర్ల తారురోడ్డు (పసుపుగెడ్డపై నిర్మించిన వంతెనతో సహా)
- రూ.90 లక్షలతో అర్జునగిరి నుంచి చెట్టుపల్లి వరకు నిర్మించిన తారురోడ్డు
- రూ.1.60 కోట్లతో చెట్టుపల్లి కాటా నుంచి చెట్టుపల్లి మీదుగా వరహాపురం, పెదగోగాడ రోడ్డు వరకు 2.65 కిలోమీటర్ల తారు రోడ్డు
- రూ.1.15 కోట్లతో చుక్కపల్లి నుంచి బోయిలకింతాడ (దేవరాపల్లి మండలం) వరకు 1.60 కిలోమీటర్ల తారురోడ్డు
- రూ.1.45కోట్లతో ఎల్.బి.పట్నం నుంచి కె.ఎల్.బి పట్నం వరకు 2.85 కిలోమీటర్ల తారురోడ్డు
- రూ.1.50 కోట్లతో వరహాపురం నుంచి పెదగోగాడ వరకు 3.20 కిలోమీటర్ల తారురోడ్డు

ఇంకా..

- రూ 3.92 కోట్లతో చీడికాడ, శిరిజాం, చుక్కపల్లి, ఖండివరం, కోనాం, దిబ్బపాలెం గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు
- ఖండివరానికి రూ 40 లక్షలతో కిలోమీటరున్నర సీసీ రోడ్డు, రూ.10 లక్షలతో దెబ్బతిన్న కోనాం, చోడవరం రోడ్డు నుంచి ఖండివరం మీదుగా వి.బి.పేట తారురోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన సీసీ రోడ్డు అభివృద్ధికి నిదర్శనగా నిలుస్తున్నాయి.

పల్లెల్లో ప్రగతి పరవళ్లు



మాడుగుల మండలం కింతలి వల్లాపురం గొరిగెడ్డపై నిర్మాణం చేపట్టిన కాజ్‌వేను సర్పంచ్ రాంబాయి, ఎంపీటీసీ వరహాలమ్మతో రిబ్బన్ కట్ చేయించి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- సీఎం జగన్ పాలనలో పల్లెలకు అభివృద్ధి కళ
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- రూ.4.98 కోట్లతో 9 గ్రామాల్లో 15 పనుల ప్రారంభం
- రూ.63 లక్షలతో చినగొరిగెడ్డ వంతెనకు శంకుస్థాపన



మాడుగుల మండలం చినగొరిగెడ్డ కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం తదితరులు

మాడుగుల: ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి కళ్లకు కట్టినట్టు కనిపిస్తుందని, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి వల్ల పల్లె వాసులంతా ఆనందంగా ఉన్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో 9 గ్రామాల్లో రూ.4.98 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 15 అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అంతకుముందు రూ.63 లక్షలతో చినగొరిగెడ్డ కాజ్‌వే నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సత్యవరం గ్రామంలో నిర్మించిన రూ.20.80 లక్షలతో వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రం, రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో పూర్తి చేసిన భవనాలను ఆయన ప్రారంభించారు. కింతలి వల్లాపురం పంచాయతీలో రూ.40 లక్షలతో గొరిగెడ్డపై నిర్మించిన కాజ్‌వే, రూ.43 లక్షలతో నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ గ్రామ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించారు. రూ.1.40 కోట్లతో జేడీపేట పంచాయతీ ఎల్.గవరవరం రోడ్డు, రూ.30 లక్షలతో సీసీ రోడ్డు, రూ.20 లక్షలతో సామాజిక భవనాలను ప్రారంభించారు. రూ.43 లక్షలతో వొమ్మలి సచివాలయానికి ప్రారంభోత్సవం చేశారు. గాదిరాయిలో రూ.5 లక్షలతో నిర్మించిన సామాజిక భవనం, వీరనారాయణంలో రూ.23.94 లక్షలతో పూర్తయిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, జి.అగ్రహారంలో రూ.20.80 లక్షలతో పూర్తయిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభించారు. జెడ్పీటీసీ కిముడు రమణమ్మ, ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు, ఎంపీటీసీలు తలారి అప్పారావు, చెదల క్రిష్ణందొర, పొలిమేర విజయలక్ష్మి, బడుగు వరహాలమ్మ, పీఏసీఎస్ అధ్యక్షులు విస్సారపు రామారావు, కోరుకొండ చెల్లం నాయుడు, బొద్దపు భాస్కరరావు, గొళ్లవిల్లి రాజేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కొసిరెడ్డి క్రిష్ణమూర్తి, నేమాల గురువు నాయుడు, తాళ్ళపురెడ్డి రాంబాయి, కిముడు మోద హైందవి గుప్తేశ్వరి పాల్గొన్నారు.

ఊరూరా అభివృద్ధి, సంక్షేమం



గంధవరంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ భవనాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి



చోడవరంలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి
- రూ.3.73 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

చోడవరం : ప్రజలకు గ్రామస్థాయిలో సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ సత్యవతి అన్నారు. చోడ వరం మండలంలో రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీ ల్యాడ్స్‌తో సుమారు రూ.3.73 కోట్ల వ్యయంతో చోడవరం పట్టణం, చాకిపల్లి, కన్నంపాలెం, జన్నవరం, నర్సయ్యపేట, గంధవరం, వెంకన్నపాలెం, అంబేరుపురం, ఎం.కొత్తపల్లి, నంబారువానిపాలెం, ముద్దుర్తి, అడ్డూ రు, నిర్మించిన గ్రామ సచివాలయ భవనా లు, రైతు భరోసా కేంద్రాలు, స్కూల్ ప్రహరీ గోడలు, కమ్యూనిటీ హాళ్లు, సిమెంటు రోడ్లను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు సత్యవతి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రూ.రెండు కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. మంచినీరు, రహదారి, పాఠశాలల సమస్యలు పూర్తిగా తీర్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, వైస్ ఎంపీపీలు బుద్ద గంగరాజు, బైన ఈశ్వరరావు, సర్పంచ్‌లు పోతల జానకీ ప్రసాద్, మూడెడ్ల శంకరరావు, సన్యాసిరావు, మొల్లి ఈశ్వరరావు, నాగబాబు, బండి నూకాలమ్మ శ్రీను, కార్లె ఈశ్వరమ్మ, కడిమి వెంకట్, వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, బీసీసెల్ అధ్యక్షుడు సోమునాయుడు, జిల్లా ఉపాధ్యక్షురాలు శ్యామల, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగుంటి నెహ్రూ, రైతు సలహా మండలి చైర్మన్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

స్కూటీ అదుపు తప్పి మహిళ దుర్మరణం



గంగయ్యమ్మ మృతదేహం

నాతవరం : ఘాట్‌రోడ్డులో స్కూటీ అదుపు తప్పిన ఘటనలో గిరిజన మహిళ మరణించింది. కొయ్యూరు మండలం ఆడాకులు పంచాయతీ శివారు కృష్ణారం గ్రామానికి చెందిన కె.గంగయ్యమ్మ(42) శనివారం ఉదయం నాతవరం మండలం సుందరకోట పంచాయతీ శివారు జంపావారి పాకలు గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి హాజరైంది. మధ్యాహ్నం భోజనం అనంతరం స్కూటీపై తిరిగి ఇంటికి వెళుతుండగా సుందరకోట సమీపంలో ఘాట్‌రోడ్డుపై స్కూటీ అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న మదుమును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గంగయ్యమ్మకు తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు గమనించి, 108కు సమాచారం ఇచ్చారు. వాహనం వచ్చి సిబ్బంది పరీక్షగా అప్పటికే మృతిచెందింది. గంగయ్యమ్మకు ఇద్దరు ఆడ పిల్లలు, భర్త ఉన్నారు. గత ఏడాది పెద్దమ్మాయికి వివాహం చేయగా చిన్నమ్మాయి చదువుకుంటుంది. భర్త కూలి పని కోసం తూర్పుగోదావరి జిల్లాలో ఉంటున్నాడు. గంగయ్యమ్మ మృతి వార్త విన్న బంధువులంతా షాక్‌కు గురయ్యారు. గంగాయమ్మ అత్తారి గ్రామం సుందరకోట, పుట్టింటి గ్రామం కృష్ణారంలో విషాదం నెలకొంది. నాతవరం పోలీసులు సంఘటన స్థలంలో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తామని నాతవరం ఎస్‌ఐ రామారావు తెలిపారు.

క్లుప్తంగా

పడమటమ్మ తీర్థ మహోత్సవం నేడు



కశింకోట : కశింకోటలోని కస్పావీధిలో ప్రసిద్ధి చెందిన పడమటమ్మ తీర్థ మహోత్సవం ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా ఇక్కడ వెలసిన అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. రాత్రి డ్యాన్స్ హంగామా, జూనియర్ ప్రేమ్‌కుమార్ ఆర్ట్స్ రికార్డింగ్ డ్యాన్స్, రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యుద్దీపాలంకరణ ఏర్పాటుతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చనున్నట్లు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

అనకాపల్లి : చినగదిలి రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య హత్యపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఇటీవల విజయనగరం జిల్లా బొండపల్లి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లిన రమణయ్య ఇంటిపై దాడి చేసి అతి కిరాతకంగా హత్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

దేవాంగుల వనసమారాధన నేడు

అనకాపల్లి : మండలంలో సత్యనారాయణ స్వామి కొండ కింద ఆదివారం దేవాంగ కుటుంబ సభ్యుల వనసమారాధన ఏర్పాటు చేసినట్లు దేవాంగ సంక్షేమ సంఘం సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

ధ్యాన వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట : స్థానికంగా కొలువైన ధ్యాన వేంకటేశ్వర స్వామి వారిని శనివారం పూలదండలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 1,147 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,710	4,710
మొదటి రకం	3,600	4,040
రెండో రకం	3,550	3,730
మూడోరకం	3,300	3,540

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
బూట్‌కట్ బాలరాజు	: సత్యనారాయణస్క్రీన్-2
నా సామిరంగ	: షిర్డిసాయి
ధీర	: పర్తిసాయి
కిస్మత్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 77 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-11 యూనిట్లు, బి పాజిటివ్-14 యూనిట్లు, ఒ పాజిటివ్-43 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు, ఎ నెగెటివ్-1 యూనిట్, ఒ నెగెటివ్-1 యూనిట్, ఏబీ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 277 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 249 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(08924223595)లో సంప్రదించవచ్చు.



గోవిందరావు కాలనీలో గొలగాని భవానీ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. భర్త లక్ష్మణరావు కూలి పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. వీరికి స్థానిక కోటదిబ్బ ప్రాంతంలోని వైఎస్సార్ జగనన్న లే-అవుట్‌లో ఇంటి స్థలం ఇచ్చారు. ఇల్లు నిర్మించుకున్నారు. తుది మెరుగులు పూర్తి కావలసి ఉంది. ఉచితంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ జరిపిస్తున్నందుకు ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి భవానీ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.



కశింకోటలోని దాడి వారి వీధిలో యల్లపు ఈశ్వరమ్మ నివాసం ఉంటున్నారు. భర్త ఈశ్వరరావు కూలీ. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లవాడు ఉన్నారు. రూ.2 వేలకు అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. వడ్డీ వీధిలోని వైఎస్సార్ జగనన్న మెగా లే-అవుట్‌లో ఆమెకు ఇల్లు ఇచ్చారు. ఇళ్ల పట్టాలను ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని ఈశ్వరమ్మ పేర్కొన్నారు.



కశింకోటలోని ముస్లిం వీధికి చెందిన వహీదా భానుకు ఇద్దరు ఆడపిల్లలు. సొంత ఇల్లు లేక అద్దె ఇంట్లో నెలకు రూ.4 వేలకు ఉంటున్నారు. వడ్డీ వీధిలోని వైఎస్సార్ జగనన్న మెగా లే-అవుట్‌లో ఇచ్చిన ఇంటి స్థల పట్టాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందివ్వడం పట్ల ఆమె కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది. సొంతింటి కల నెరవేరిందని, సీఎంకు ధన్యవాదాలని ఆమె తెలిపారు.



కశింకోట గవరపేటలో 20 ఏళ్లుగా నక్కా నాగవేణి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. భర్త నరసింహమూర్తి కూలి. కుమారుడున్నారు. వడ్డీ వీధి వైఎస్సార్ జగనన్న మెగా లే-అవుట్‌లో ఇల్లు ఇచ్చారు. ఇంటి పట్టా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తుండటం పట్ల నాగవేణి ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికి తమ కష్టాలు గట్టెక్కాయని సంతోషం వ్యక్తం చేశారు.

జగనన్న చెబితే.. చేస్తాడంతే..

- ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల నేపథ్యంలో లబ్ధిదారుల ఖుషీ
- సీఎం జగన్ వల్లే సొంతింటి కల నెరవేరిందని హర్షం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అనడానికి ఇదో తార్కాణంగా నిలుస్తోంది. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వడమే కాకుండా పట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. సాధారణంగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రూ. వేలు ఖర్చు అవుతాయి. అంత వ్యయం భరించే స్థితిలో లేని పేదలకు భవిష్యత్‌లో అవసరాలకు విక్రయించుకోవడానికి ఉపయోగపడే విధంగా ఇళ్ల పట్టాలను సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేయించి సర్వ హక్కులతో కన్వేయన్స్ డీడ్ అందివ్వడానికి చర్యలు తీసుకున్నారు.



కశింకోట సచివాలయంలో ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది



పట్టాల రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు

కశింకోట : మండలంలోని జగనన్న లే-అవుట్లలో రెండు రోజులుగా ముమ్మరంగా ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలో వైఎస్సార్ జగనన్న పేదల ఇళ్ల కాలనీలు, లే-అవుట్లు, సొంత స్థలాలకు కలిపి 2737 ఇళ్ల పట్టాలిచ్చారు. 2020న ఇచ్చిన పట్టాల స్థానంలో సర్వ హక్కులు కల్పించడానికి గాను కన్వేయన్స్ డీడ్‌లను అందివ్వడానికి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మండలంలో ఉన్న 20 సచివాలయాల్లో ఈ ప్రక్రియ గత రెండు రోజులుగా జరుగుతోంది. దీని వల్ల ఇళ్ల పట్టాలిచ్చిన పదేళ్లకు తమ ఇళ్లు, స్థలాలు అధికారికంగా మార్కెట్ ధర ప్రకారం విక్రయించుకోవడానికి లబ్ధిదారులకు అవకాశం కలుగుతుంది. ఇప్పటికే కశింకోటలో 200 పైగా, తాళ్లపాలెంలో 80 వరకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ శనివారానికి నిర్వహించారు. మిగిలినవి ఈ నెల 6లోగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కన్వేయన్స్ డీడ్‌లు ఇవ్వనున్నారు.

రిజిస్ట్రేషన్ కోసం బారులు..

జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కోసం సచివాలయాల్లో లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. కశింకోటలో రాత్రి అయినా వెరవకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను తాళ్లపాలెం సచివాలయంలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్థిక భారం లేకుండా ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో అవసరాలకు అమ్ముకోవడానికి అవకాశం ఉండడంతో లబ్ధిదారులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సీఎంకు కృతజ్ఞతలు..



మాకు సొంతిల్లు లేదు. వడ్డీ వీధిలో సీఎం జగనన్న ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు ఇంటి పట్టాను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయడం ఆనందంగా ఉంది. ఇందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– మండా నాగమణి, కశింకోట.

పేదలపై భారం పడదు..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇల్లివ్వడమే కాకుండా ఇంటి పట్టాను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం సంతోషకరం. మాలాంటి పేదలపై ఆర్థిక భారం మోపకుండా పట్టా రిజిస్ట్రేషన్ చేసి అందిస్తుండటం పట్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– నిమ్మకాయల అమ్మాజీ, కశింకోట.

19లోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తాం..



మండలంలో 2737 మంది ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్నాం. వీటిలో మండల కేంద్రం కశింకోటలో 594 మందికి రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. ఈ ప్రక్రియ ఈ నెల 19లోగా పూర్తి చేయాల్సి ఉంది. అనంతరం ప్రభుత్వం నిర్ణయం మేరకు కన్వేయన్స్ డీడ్‌లను లబ్ధిదారులకు అందజేస్తాం. దీనివల్ల 2020లో ఇచ్చిన పట్టాలకు అప్పటి నుంచి పదేళ్ల తర్వాత అవసరమైతే అమ్ముకోవడానికి అవకాశం కలుగుతుంది.

–మధుసూదన్, తహసీల్దార్, కశింకోట.

'ఆసరా' సంబరాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు

కశింకోట : మండల స్థాయిలో కశింకోటలో ఈ నెల 6న నిర్వహించనున్న వైఎస్సార్ 'ఆసరా' సంబరాలు విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం స్వయం సహాయక సంఘాల వీవోఏలు, ఉపాధి హామీ పథకం ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కార్యక్రమానికి తరలి వచ్చి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో శేషుబాబు, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, ఈవోఆర్డీ సోమరాజు, ఎన్ఆర్ఈజీఎల్ ఏపీవో శివ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



టిడ్కో ఇళ్ల పత్రాలు అందిస్తున్న మలసాల భరత్‌కుమార్

తుమ్మపాల : జగనన్నను మళ్లీ ఎన్నుకుంటే సంక్షేమ పాలన కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. పట్టణంలో 5,6 సచివాలయాల పరిధి లక్ష్మీదేవిపేట సీతారామ కల్యాణ మండపంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేసి సొంత నిధులతో ఇంటి తాళాలు అందించారు. సీఎం జగన్ చేస్తున్న మంచిని గుర్తించి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపించుకుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, 84వ వార్డ్ ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, లబ్ధిదారులు పాల్గొన్నారు,

43వ రోజుకు న్యాయవాదుల దీక్షలు

తుమ్మపాల : ప్రజల పక్షాన న్యాయవాదులు పోరాడుతుంటే ప్రభుత్వం వలంటీర్లచే భూహక్కు చట్టంపై ప్రచారం చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని అసోసియేషన్ ప్రెసిడెంట్ శేఖరమంత్రుల సాయివెంకట లక్ష్మణ్, కార్యదర్శి సుర శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో కోర్టు ప్రాంగణంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు నేటితో 43వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూహక్కుల చట్టం 2022ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించలేదన్నారు. దీక్షలో అనకాపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు, ఇతర ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దొంగతనాలు జరగకుండా జాగ్రత్త వహించాలి



మద్యం దుకాణాల సూపర్‌వైజర్లతో మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు

కశింకోట : ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొంగతనాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఐ వినోద్‌బాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ప్రభుత్వ మద్యం దుకాణాల సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దొంగతనాలు జరగకుండా వైన్‌షాపుల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. రాత్రి పది గంటలకు దుకాణం మూసిన తర్వాత తనకు వాట్సప్ ద్వారా సమాచారం అందివ్వాలన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ 'వెంపలి'కి ఘన నివాళి

తుమ్మపాల : సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ కవి వెంపలి శివప్రసాద్ సమాజసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని, జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేశారని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు దాడి వెంకట్రావు, సెక్రటరీ కొమ్మోజు రమేష్, గౌరవ అధ్యక్షుడు సాయిరాం అన్నారు. పట్టణంలో వెంపలి నివాసం వద్ద జరిగిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, ఎస్‌వీవీ రామచంద్రరావు, సలహాదారులు శిలపరిశెట్టి మాణిక్యం పాల్గొన్నారు.

వచ్చే వారం నుంచి ఉపాధి పనులు

మాడుగుల రూరల్: ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టరు ఇ. సందీప్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 10,953 కుటుంబాలకు పనులు కల్పించామని, తద్వారా రూ.9.91 కోట్లు వేతనం రూపంలో కూలీలకు చెల్లించామన్నారు. మెటీరియల్ రూపంలో రూ.7 కోట్లు వెచ్చించామన్నారు. ఈ నెల రెండో వారం నుంచి ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తామన్నారు. కొండపోడు భూములు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన రైతులకు ఉచితంగా 20 రకాలు మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో 29 గ్రామ పంచాయతీలు చేపట్టిన పనులు, ఇచ్చిన వేతనాల రికార్డులను తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి అపరాధరుసుంగా రూ.5 వేల రికవరీ చూపించారు. ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఉపాధి హామీ పథకం అదనపు ప్రాజెక్టు అధికారి రోజారాణి, ఏపీడీ శ్రీనివాస్, మండల పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ యడ్ల కళావతి, ఏపీవో నవర వరహాలబాబు, డీఆర్పీలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వయో వృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం రేపు

అనకాపల్లి : స్థానిక వీవీ రమణ రైతుభారతి హాల్లో సోమవారం వయోవృద్ధుల సంక్షేమ సంఘ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు వృద్ధులందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. వృద్ధుల సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

కశింకోట : పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎల్.మధుసూదన కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. పేర్ల నమోదుకు సంబంధిత బీఎల్వోలను సంప్రదించాలన్నారు. మండలంలో మొత్తం 55వేల707 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలో 28,920 మంది మహిళలు, 26,786 మంది పురుషులు ఉన్నారని చెప్పారు. ఒకరు ఇతరులు ఉన్నారన్నారు. కొత్తగా 3,481 మంది ఓటర్లు చేరారన్నారు. 4,764 మంది సవరణలు చేసుకున్నట్లు చెప్పారు.

ఎమ్మార్వో హత్యను ఖండించిన వీఆర్వోల సంఘం

తుమ్మపాల : విశాఖపట్టణం రూరల్ మండలం తహసీల్దార్ రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామకాసు, అనంతరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రమణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నిందితులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, తహశీల్దార్ రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. భూ వివాదాలు ఉన్న మండలాల్లో పని చేస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తులు

తుమ్మపాల: జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్థిర గౌరవ వేతనంపై పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోర్డినేటర్ ఎన్.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. anakapai.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 7వ తేదీలోగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ, ఎన్టీఆర్ హాస్పిటల్, అనకాపల్లిలో స్వయంగా లేదా పోస్టు ద్వారా సమర్పించాలన్నారు. మరింత సమాచారం కోసం జిల్లా కోఆర్డినేటర్ 8121622999ను సంప్రదించాలన్నారు.

తహసీల్దార్ రమణయ్యకు రెవెన్యూ సంఘం నివాళి



మౌనం పాటిస్తున్న రెవెన్యూ అసోసియేషన్ ఉద్యోగులు

తుమ్మపాల: విశాఖపట్నం రూరల్ తహసీల్దార్‌గా పనిచేసి విజయనగరం జిల్లాకు బదిలీ అయిన సనపల రమణయ్య దారుణ హత్యకు గురవడం పట్ల జిల్లా రెవెన్యూ అసోసియేషన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. అసోసియేషన్ పిలుపు మేరకు కలెక్టరేట్‌లో ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ శనివారం డీఆర్వో బి.దయానిధితోపాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది మౌనం పాటించారు. రమణయ్య వివాదరహితుడు, మంచి వ్యక్తి, సౌమ్యుడు అని చెబుతూ తమతో కలిసి పనిచేసిన రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. 2019లో ఎన్నికల సందర్భంగా విశాఖపట్నం జిల్లాకు వచ్చి మొన్నటి వరకు ఇక్కడే పనిచేశారని, ఎన్నికల సందర్భంగా ఆయన విజయనగరం బదిలీ అయ్యారన్నారు.

ఏవో ఎ.శ్రీనివాసరావు, మినిస్టీరియల్ సెక్షన్ ఏవో ఎం.ఎ.శ్రీనివాసరావు, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ బి.సత్యనారాయణ ఈ ఘటనను ఖండించారు.

కన్నూరుపాలెంలో చురుగ్గా అభివృద్ధి పనులు



కన్నూరుపాలెం ఎస్టీకాలనీలో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

కశింకోట : మండలంలో కన్నూరుపాలెంలో పలు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పంచాయతీ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి ఎస్టీ కాలనీలో సిమెంట్‌రోడ్డు, కాలువలు నిర్మిస్తున్నారు. రూ.6 లక్షలతో సామాజిక భవనం నిర్మించారు. రూ.3 లక్షలతో శ్మశాన వాటికలో షెడ్డు నిర్మించి అభివృద్ధి చేశారు. పాతకన్నూరుపాలెం గ్రామంలో రూ.5 లక్షలతో సిమెంట్‌రోడ్డు నిర్మించారు.

టెన్త్ విద్యార్థులు పరీక్షల పట్ల శ్రద్ధ వహించాలి



విద్యార్థుల చదువును పరిశీలిస్తున్న హెచ్‌ఎం అప్పారావు, ఉపాధ్యాయులు

కశింకోట : టెన్త్ విద్యార్థులు పరీక్షల పట్ల శ్రద్ధ వహించాలని డీపీఎస్ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు అన్నారు. టెన్త్ విద్యార్థులు తమ ఇళ్ల వద్ద ఏ విధంగా చదువుతున్నారనే విషయాన్ని ఉపాధ్యాయులతో పాటు బృందంగా వెళ్లి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఉపాధ్యాయులు పీవీఆర్ ప్రభాకర్, ఆచంట రవి, బి. అప్పారావు, ఎస్‌జేవీ ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ మేరీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



దీక్షలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తుమ్మపాల : తమ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ అన్నారు. పట్టణంలో నెహ్రూ చౌక్ వద్ద చేస్తున్న నిరాహార దీక్షలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల కోట్లు బకాయి ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి ప్రభుత్వం ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉందని చెబుతూ, మరో వైపు ఒకటో తారీఖున ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించటం లేదన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు గాయత్రి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు రమేష్‌రావ్, శేషుకుమార్, ఎ.ప్రకాష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి చక్కటి స్పందన



కంటి పరీక్ష చేస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి వైద్యురాలు సమృద్ధ్ దేశ్‌ముఖ్

కశింకోట : పదవీ విరమణ ఉద్యోగుల సంఘంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది. 92 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. 14 మందికి కంటి ఆపరేషన్లు చేయడానికి విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. మరో 16 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి సిఫార్స్ చేశారు. కంటి వైద్య నిపుణులు సమృద్ధ్ దేశ్‌ముఖ్, ఊర్వశిసింగ్ హాజరై కంటి పరీక్షలు నిర్వహించారు. ఆప్తాల్మిక్‌లు, సిబ్బంది సహకరించారు. మేనేజర్ ఎం. చంద్రశేఖర్, పదవీ విరమణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, కార్యదర్శి గోపాలరావు, రిటైర్డు ఎంఈవో నంబా రమణ, కరణం సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.